క్లుప్తంగా

గర్భిణులకు వైద్య పరీక్షలు



పీహెచ్‌సీలో గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యులు

హనుమంతునిపాడు: స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 20 మంది గర్భిణులకు పరీక్షలు చేశారు. బీపీ, సుగర్, రక్త పరీక్షలు చేసి మందులు అందజేశారు. కాన్పులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పులు చేయించుకుంటే ప్రభుత్వం అందించే రాయితీలు వస్తాయన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులు ఆక్రమిస్తే కఠిన చర్యలు



సర్వేను పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ మంజునాథరెడ్డి

సీఎస్‌పురం(పామూరు): చెరువులను ఎవరైనా ఆక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ డి.మంజునాథరెడ్డి హెచ్చరించారు. మండలంలోని బోడావులదిన్నె చెరువు సర్వేనంబర్ 6ను మంగళవారం తహసీల్దార్ ఆధ్వర్యంలో సర్వేచేసి హద్దులు ఏర్పరిచి రాళ్లు పాతించారు. కార్యక్రమంలో సర్వేయర్ బ్రహ్మానందరెడ్డి, నీటి సంఘం చైర్మన్ దాసరి మల్లికార్జున, గ్రామ సర్వేయర్లు గురుప్రసాద్, శ్రీరామ్, వీఆర్‌ఓ ఓబుల్‌పతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి సారించండి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు

సింగరాయకొండ: పెండింగ్ కేసులపై దృష్టి సారించాలని డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పలు రికార్డులు పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సీసీ కెమెరాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా ఉండాలని సూచించారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. సింగరాయకొండ సీఐ సిహెచ్ హజరత్తయ్య, ఎస్సై బి. మహేంద్ర, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు



విద్యుత్ సర్వీసులను తనిఖీ చేస్తున్న అధికారులు

పీసీపల్లి: మండలంలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. దాడిలో విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హైమావతితో పాటు కనిగిరి ఏడీఏ వీరయ్య, ఉమాకాంత్, కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మొత్తం 27 బృందాలుగా ఏర్పడి తనిఖీ చేశారు. తనిఖీల్లో తక్కువ లోడ్ సర్వీసు తీసుకొని ఎక్కువ లోడ్ వాడుతున్న 58 సర్వీసులకు రూ.2.11 లక్షలు, మరో ఐదు సర్వీసులకు రూ.32,000, విద్యుత్ అక్రమంగా వాడుతున్న వారికి రూ.7,500 మొత్తం రూ.2.56 లక్షల జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు.

దీన్ దయాళ్ సేవలు ఎనలేనివి



దీన్‌దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పామూరు: దేశంలో సమసమాజాభివృద్ధికి పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ చేసిన కృషి ఎనలేనిదని బీజేపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండిశెట్టి వెంకట రమణయ్య పేర్కొన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో మంగళవారం బీజేపీ మండల అధ్యక్షుడు ఉమ్మడిశెట్టి శ్రీనివాసులు అధ్యక్షతన పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ బలిదన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు బీజేపీ నాయకులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. సింగరాజు శివ రామకృష్ణ, పెరమణ విజయకుమారాచారి, కొప్పరపు వెంకటసుబ్బారావు, జాజం చినసుబ్బయ్య, కొత్తూరు వెంకట హరగోపాల్, దేవిశెట్టి పవన్‌కుమార్, పాడే అరవింద్, పందిటి శ్రీనివాసులు జేపీ నాయకులు పాల్గొన్నారు.

పుచ్చ రైతుకు తెగుళ్ల దెబ్బ..!

- సాగు ప్రారంభం నుంచి వెంటాడుతున్న తెగుళ్లు
- పురుగుమందులు పిచికారీ చేసినా అదుపులోకి రాని వైనం
- తెగుళ్లతో తగ్గిన దిగుబడి
- ఎకరాకు రెండు టన్నులకు పడిపోయిన దిగుబడి



దాసళ్లపల్లిలో కోతకొచ్చిన పుచ్చకాయ

హనుమంతునిపాడు: పుచ్చ సాగు చేసిన రైతులను తెగుళ్ల బెడద పట్టిపీడిస్తోంది. ఎన్ని పురుగుమందులు పిచికారీ చేసినా తెగుళ్ల అదుపులోనికి రాకపోవడంతో ఏం చేయాలో తెలియక రైతులు కొట్టుమిట్టాడే పరిస్థితి నెలకొంది. తెగుళ్ల బెడదతో దిగుబడి తగ్గి పెట్టుబడులు కూడా వచ్చే అవకాశం కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు.

విస్తారంగా సాగు..

మండల పరిధిలో నల్లకరపుచ్చ సాగు అధికారుల అంచనాల ప్రకారం కూటాగుండ్లలో 400 ఎకరాలు, దాసళ్లపల్లి గ్రామ పరిధిలో 500 ఎకరాలు, సీతారాంపురం గ్రామ పరిధిలో 200 ఎకరాల్లో సాగు చేశారు. గత ఏడాది పుచ్చ సాగు చేసిన రైతులకు ఎకరాకి 15 నుంచి 20 టన్నుల వరకు దిగుబడి వచ్చింది. రైతుల నుంచి ఇతర జిల్లాల వ్యాపారులు రూ.10 నుంచి రూ.15 వరకు వెచ్చించి కొనుగోలు చేశారు. దీంతో రైతులకు మంచి లాభాలు వచ్చాయి. దీంతో ఈ ఏడాది రైతులు విస్తారంగా పుచ్చ సాగు చేశారు. కానీ రైతుల ఆశలు అడియాశలు చేస్తూ సాగు ప్రారంభంలోనే తెగుళ్ల సోకి ముదురు తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో ఎకరాకు రెండు నుంచి మూడు టన్నుల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. ఎకరాకు రూ.80 వేల వరకు పెట్టుబడి ఖర్చవుతుంది. తెగుళ్లతో తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రస్తుతం వ్యాపారులు కిలో రూ.10కి కొనుగోలుచేస్తున్నా దిగుబడి అంతంతమాత్రంగానే ఉంది. ఎకరాకు 15 నుంచి 20 టన్నుల దిగుబడి వస్తేనే రైతులకు లాభాలు వచ్చేది. ప్రస్తుతం వస్తున్న దిగుబడులతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు దేవిరెడ్డి వెంకటరెడ్డి, ఉడుముల జగన్‌హన్ రెడ్డి, పుల్లారెడ్డి, గాయ క్రిష్టారెడ్డి వాపోతున్నారు.

అదుపులోనికి రాని తెగుళ్లు

పుచ్చ సాగు ప్రారంభంలోనే రైతులను తెగుళ్ల వెంటాడాయి. దీంతో రైతులు పురుగు మందులు పిచికారీ చేశారు. కానీ ఎన్ని పురుగు మందులు చల్లినా తెగుళ్ల అదుపులోకి రాలేదని రైతులు చెబుతున్నారు. పూత రాలిపోవడం, పిందె రాలి గడ్డుబారి పోవడం, తీగే కోసలు మాడిపోవడం తెగుళ్ల వల్ల తోటలు దెబ్బతన్నాయి. దీంతో పూర్తిగా నష్టాలు తప్పవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఉడుములవారిపల్లిలో సాగు చేసిన పుచ్చసాగు



కూటాగుండ్లలో తెగుళ్లను పరిశీలిస్తున్న హెచ్‌ఓ



కూటాగుండ్లలో నిమ్మతోటలో సాగు చేసిన పుచ్చ

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన చింతలచెరువు

కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెడ్డి కార్పొరేషన్ మాజీ చైర్మన్ చింతలచెరువు సత్యన్నారాయణరెడ్డి మంగళవారం కలిశారు. తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో పార్టీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో కలిసి జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.



వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో చింతల చెరువు సత్యన్నారాయణరెడ్డి

విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ



తిమ్మారెడ్డిపల్లిలో సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు



వల్లూరులో వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ స్వర్ణలత

హనుమంతునిపాడు: విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ సాధ్యమని వ్యవసాయాధికారి కె.రమణ అన్నారు. మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, హనుమంతునిపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. పండ్ల తోటల సాగు, ఉలవ, మినుము, నిమ్మ తోటలను పరిశీలించారు. తెగుళ్లను పరిశీలించి తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు వివరించారు. హెచ్‌ఓ ఎం.అంజలీబాయి నిమ్మ, బత్తాయి, పండ్ల తోటలు జామ, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్స్, ఉద్యానవన పంటల సాగుపై తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై రైతులకు సలహాలు సూచలిచ్చారు. వ్యవసాయ సిబ్బంది గోపికృష్ణ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

టంగుటూరు: మండలంలోని వల్లూరు, సూరారెడ్డిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి స్వర్ణలత మాట్లాడుతూ రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. వర్షాల వల్ల శనగ సాగు చేయడం ఆలస్యమైన కారణంగా తుప్పు తెగులు వచ్చే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ సహాయకులు జి.సౌమ్య, ఎంపీఈఓ అజయ్, విస్తరణ అధికారులు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భూ ఆధార్ నమోదు వేగవంతం చేయాలి



భూ ఆధార్ నమోదు పర్యవేక్షిస్తున్న ఏఓ రాధ



పీసీపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఏఓ

పామూరు: మండలంలోని అన్ని రైతు సేవాకేంద్రాల్లో భూ ఆధార్ (రైతు గుర్తింపు సంఖ్య) ప్రక్రియను వేగవంతం చేయాలని వ్యవసాయాధికారి కె.రాధ అన్నారు. మండలంలోని బొట్లగూడూరు, కంబాలదిన్నె గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ భూ ఆధార్ వల్ల రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని, ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఎంతో సులభతరమవుతుందని పేర్కొన్నారు. రైతుసేవాకేంద్రాల్లో నిర్వహిస్తున్న భూ ఆధార్ నమోదు ప్రక్రియను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఆదేవిధంగా సాగులోఉన్న కంది, జొన్న, వరి పైర్లను పరిశీలించి సూచనలు చేశారు. కోత దశలో ఉన్న పంటలను పరిశీలించి కోతల అనంతరం రైతులు అవలంబించాల్సిన పద్ధతులను వివరించారు. వీఏఏలు యస్.రమేష్, ఎ.హరికృష్ణ, రైతులు పాల్గొన్నారు.

పీసీపల్లి: రైతులంతా విధిగా భూ ఆధార్ చేయించుకోవాలని వ్యవసాయాధికారి కె.ప్రకాష్‌రావు అన్నారు. మండలంలోని పిల్లివారిపల్లి, శంకరాపురంగ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు భూ ఆధార్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఏఈఓ పుల్లయ్య వీఏఏ రసూల్, అఖిల్ రైతులు పాల్గొన్నారు

పంటల నమోదు తప్పనిసరి

కొండపి: మండలంలోని రైతులంతా తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి డి.విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని చిన్న వెంకన్నపాలెం, కె.ఉప్పలపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత పొలం ఉన్న రైతులంతా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు 11 అంకెల యూనిక్ నంబర్ ఇస్తామని తెలిపారు. ఏపీఎంఐపీ ఎంఐఏఓ జి.సుజాత, వ్యవసాయ సహాయకులు జె.కొండలరావు డి.జయలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

పొన్నలూరు: వ్యవసాయ రంగాన్ని సులభతరం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఆధార్ కార్డు తరహాలో కొత్తగా గుర్తింపు సంఖ్యను పొందడానికి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఓ పూర్ణచంద్రరావు తెలిపారు. రైతులు గుర్తింపు సంఖ్యను పొందడం వల్ల ప్రభుత్వ పథకాలు, రాయితీ వ్యవసాయ పరికరాలు, పంట రుణాలు, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, పెట్టుబడి సాయం వంటివి పొందవచ్చన్నారు. రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, సెల్‌ఫోన్ నంబర్‌తో స్థానిక రైతు సేవా కేంద్రాలను సందర్శించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

సీఎస్‌పురం(పామూరు): పొలం కలిగి ఉన్న రైతులంతా తప్పనిసరిగా రైతుసేవా కేంద్రానికి వెళ్లి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఓ బి.సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని నల్లమడుగుల, శీలంవారిపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ సంపత్‌కుమార్ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోగానే రైతులకు గుర్తింపు సంఖ్య వస్తుందన్నారు. రానున్న కాలంలో రైతులకు ఏ పథకం కావాలన్నా ఫార్మర్ గుర్తింపు సంఖ్య ముఖ్యమన్నారు. అనంతరం జొన్న, కంది పైర్లను పరిశీలించి వాటిని ఆశించే తెగుళ్ల, లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఏఈఓ పి.శ్రీనివాసులు, వీఏఏలు విజయబాస్కర్, వి.హారీష్, రైతులు పాల్గొన్నారు.




రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ విజయ్‌కుమార్

మర్రిపూడి: మండలంలోని రైతులంతా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటేష్ అన్నారు. మండలంలోని తంగెళ్ల, అయ్యపురాజుపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది నిర్వహించారు. విస్తరణాధికారి కోటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు యశ్వంత్, రైతులు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రాణానికి రక్ష

కొండపి: ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సీఐ సోమశేఖర్ అన్నారు. స్థానిక టంగుటూరు రోడ్డులో హెల్మెట్ వినియోగంపై మంగళవారం ప్రత్యేకమైన డ్రైవ్ నిర్వహించి ద్విచక్రవాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతా నిబంధనపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. హెల్మెట్ ధరించకపోతే మోటార్ వెహికల్ చట్టం ప్రకారం జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అనంతరం హెల్మెట్లు లేకుండా కొండపిలోకి వస్తున్న వారిని వెనక్కి పంపించారు. అనంతరం ద్విచక్రవాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎస్సై ప్రేమ్‌కుమార్, ఏఎస్సై అంకారావు, హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



ద్విచక్ర వాహనదారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ సోమశేఖర్

గుండెపోటు వచ్చిన తొలి గంట కీలకం

కొండపి: గుండెపోటు వచ్చిన తొలి గంట ఎంతో కీలకమని కొండపి సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ వరలక్ష్మి అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్టెమీగుండెకు భరోసా ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వరలక్ష్మి మాట్లాడుతూ గుండె వ్యాధులకు చికిత్సలో అత్యాధునిక వైద్యాన్ని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రభుత్వం అందుబాటులోనికి తీసుకువచ్చిందన్నారు. ఛాతి నొప్పితో బాధపడుతున్న వ్యక్తులు ఒక గంటలోపు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే వెంటనే వైద్యులు ఈసీజీ తీసి గుండె సంబంధిత వ్యాధిని గుర్తిస్తే అవసరమైన వారికి రూ.40 వేల విలువైన టెనెక్టప్లేజ్ ఇంజక్షన్ను ఉచితంగా వేస్తామన్నారు. అనంతరం ప్రజలకు సిబ్బందికి కరపత్రాల ద్వారా స్టెమీ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ వరుణ్ తేజ, డాక్టర్ పి.గీత, డాక్టర్ బి.పరిమళ, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వరలక్ష్మి

13 నుంచి ఉచిత శిక్షణ ప్రారంభం

కొండపి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ట్రైనింగ్ సెంటర్లో ఈ నెల 13 నుంచి ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభించనున్నట్లు స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ గోపీకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కిల్ హబ్ సెంటర్లో డొమెస్టిక్ ఐటీ హెల్ప్ డెస్క్ అటెండెన్స్ కోర్స్, టైలరింగ్‌పై మూడు నెలల పాటు శిక్షణ తరగతులునిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత ఉద్యోగవకాశాలు కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు 8897964505 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

దివ్యాంగులకు భోజన వసతి

కనిగిరిరూరల్: సదరం ధృవీకరణ పత్రాల పునః పరిశీలను వచ్చిన దివ్యాంగులకు కేఎస్ఎం ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ మంగళవారం భోజన వసతి కల్పించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో దివ్యాంగులకు సదరం ధృవీకరణ పత్రాల పునః పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. వైద్యశాల సూపరింటెండెంట్ సుబ్బయ్య, డాక్టర్ తిరుపతిరెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ బొట్టు శ్రీను పాల్గొన్నారు.

వైభవంగా ప్రతిష్టా మహోత్సవాలు



గ్రామోత్సవంలో ఇన్‌చార్జ్ దద్దాల, చింతలచెరువు, నాయికులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని అయ్యలూరివారిపల్లెలో శ్రీలక్ష్మీ గణపతి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని రెండవరోజు మంగళవారం నవగ్రహహోమం, లక్ష్మీహోమం అర్చకులు వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీగణపతి మూలవిగ్రహమూర్తికి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. పూజల్లో వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణయాదవ్, రెడ్డి కార్పొరేషన్ మాజీ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా వారిని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల నారాయణరెడ్డి, భూమిరెడ్డి వెంకటరెడ్డి, ఆలయ కమిటీ ఘనంగా సన్మానించింది. వైస్ ఎంపీపీలు దుగ్గిరెడ్డి ప్రతాప్ రెడ్డి, భూమిరెడ్డి ప్రభంజన, జెడ్పీటీసీ మేకల శ్రీనివాసులు, స్థానిక సర్పంచ్ ముత్యాల భారతీరెడ్డి, కనిగిరి జెడ్పీటీసీ ఎం కస్తూరిరెడ్డి, పామూరు ఎంపీపీ గంగసాని లక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ పులి శాంతిగోవర్ధన్‌రెడ్డి, అంబటి కొండారెడ్డి, కల్లూరి రామిరెడ్డి, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటయ్య, ముడుమాల నారాయణరెడ్డి, బైరెడ్డి తిరుపతిరెడ్డి, అటేలయ్య, ముత్యాల రమణారెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మానవతా సంస్థ సేవలు అభినందనీయం

కనిగిరిరూరల్: మానవతా సంస్థ సేవలు అభినందనీయమని డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ అన్నారు. మానవతా సంస్థ దాతృత్వంతో కనిగిరి మోడల్ స్కూల్‌కు బహూకరించిన ప్రింటర్‌ను డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ చేతుల మీదుగా మంగళవారం స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ రమణయ్యకు అందచేశారు. విజేత విద్యా సంస్థల అధినేత పసుపులేటి అరుణోధర్, మోడల్ స్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ పందిటి మోహన్, ఎన్‌హెచ్ఆర్‌సీ జాతీయ కో కన్వీనర్ గుత్తి శ్రీధర్, మానవతా సంస్థ చైర్మన్ సోమిశెట్టి శ్రీనివాసులు, అధ్యక్షుడు తాని గుండాల శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మోడల్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్‌కు ప్రింటర్‌ను అందచేస్తున్న డీఎస్పీ

టంగుటూరు పీహెచ్‌సీ సందర్శన

టంగుటూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎన్‌వీబీడీసీపీ డిప్యూటీ డైరెక్టర్ రామనాథం మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పీహెచ్‌సీలో జరుగుతున్న అన్ని కార్యక్రమాలను పర్యవేక్షించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షల వివరాలు అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇటీవల వాణీనగర్‌లో డెంగీ పాజిటివ్ నమోదైన నాగేంద్రబాబు ఇంటిని ఆయన సందర్శించారు. ఆ ప్రాంతంలోని ప్రతి ఒక్కరికీ ఫీవర్ సర్వే చేయాలని సూచించారు. ఏఎల్‌ఓ, పీడీపీ, ఐఎస్ఎస్ తదితర ఆరోగ్య కార్యక్రమాలను పరిశీలించారు. వైద్యులు డాక్టర్ జి.బాలాజీ, అశోక్, ప్రసాద్‌బాబు, అన్వేష్, డీఎంవో మధుసూదన్‌రావు, సాగర్ పాల్గొన్నారు.



ఫీవర్ సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ రామనాథం

10 మంది జూదరుల అరెస్టు

టంగుటూరు: మండలంలోని కొణిజేడు గ్రామ శివారులో పేకాట శిబిరంపై సోమవారం రాత్రి పోలీసులు మెరుపు దాడి చేశారు. ఎస్సై నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి పది మంది జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.93,700 స్వాధీనం చేసుకున్నారు.

కొండపి: మండలంలోని పెరిదేపి, ముప్పారాజుపాలెం గ్రామాల మధ్య పేకాట శిబిరంపై మంగళవారం రాత్రి పోలీసులు మెరుపు దాడి చేశారు. ఎస్సై ప్రేమ్ కుమార్ సిబ్బందితో కలిసి పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.83,900 నగదు స్వాధీనం చేసుకున్నారు.

క్లస్టర్ స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ

సీఎస్‌పురం(పామూరు): ఉపాధ్యాయులందరికి ప్రతి నెల 3వ శనివారం క్లస్టర్ స్థాయిలో అకడమిక్ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని విద్యాశాఖాదికారి రాజాల కొండారెడ్డి తెలిపారు. ఈనెల 15వ తేదీన మొదటి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభిస్తామని, ఈమేరకు పాఠశాల విద్య కమిషనర్ ఆదేశాలు జారీచేశారని ఎంఈఓ తెలిపారు. శిక్షణ ప్రతి నెల మూడో శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఉపాధ్యాయులందరికీ ఉంటుందన్నారు. క్లస్టర్ స్థాయిలో ఇందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు ఐఎఫ్‌పీ ప్యానళ్లు, ఇంటర్‌నెట్ సదుపాయాలను సిద్ధం చేస్తున్నామని ఎంఈఓ తెలిపారు. కేవలం అకడమిక్ అంశాలను మాత్రమే చర్చించాలని, ప్రతి క్లస్టర్‌కు ఒక పరిశీలకుడు ఉంటారన్నారు. ఉపాధ్యాయులు ఆన్‌లైన్ హాజరును క్లస్టర్ స్థాయిలోనే నమోదుచేయాల్సి ఉంటుందన్నారు. క్లస్టర్‌స్థాయిలో ఉపాధ్యాయులందరికీ ఒకేసారి శిక్షణ ఇవ్వడానికి నిర్ణయం తీసుకున్నట్లు ఎంఈఓ పేర్కొన్నారు.